
సాక్షి
మెదక్
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



ఆరు ఊర్లై.. అంతా క్రైస్తవులై

హత్నూర మండలం రెడ్డిపాలెం గ్రామ మంతా రోమన్ క్యాథలిక్ క్రిస్టియన్స్ కావడం విశేషం. వివరాలు 8లో ▸



పెళ్లయిన రాత్రికే పరార్..

ఉదయం వైభవంగా పెళ్లి.. రాత్రి బరాత్.. సీన్ కట్ చేస్తే.. తెల్లారేసరికి పెళ్లి కూతురు పరార్. వివరాలు 8లో ▸



పరిశోధనల్లో కీలక పాత్ర

కొత్త పరిశోధనల్లో ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని జపాన్ వర్సిటీ ప్రొఫెసర్ అన్నారు. వివరాలు 9లో ▸



మెర్రీ క్రిస్మస్

సుందరంగా కరుణామయుడి కోవెల

ఏసయ్య మందిరం క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించనుండడంతో అందుకు తగిన సన్నాహాలు చేస్తున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్లుగా నిర్వాహకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపనుండగా.. ప్రత్యేక దుకాణాలు, రంగుల రాట్నాలతో చర్చి ఆవరణ జాతరను తలపిస్తోంది. క్రిస్మస్ తాతయ్య బొమ్మలు, ఏసయ్య శిలువలు, స్టార్‌లతో పాటు బైబిళ్లు ఆకట్టుకుంటున్నాయి.

– మెదక్‌జోన్





శతాబ్ది వేడుకలకు చార్లెస్ వాకర్ వంశీకులు

శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెదక్ చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ రక్త సంబంధీకులు సోమవారం చర్చిని సందర్శించారు. వారికి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వాకర్ వారసులను కలిసి పలకరించారు.



చర్చిలో హరీశ్‌రావును ఆశీర్వదిస్తున్న బిషప్

క్రిస్మస్‌ను అధికారికంగా జరిపాం

- గిఫ్టులు సైతం అందజేశాం
- మెదక్ చర్చి శతాబ్ది వేడుకల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్‌జోన్: క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించి ఘనంగా నిర్వహించిన ఒకే ఒక్క సీఎం కేసీఆర్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా చర్చి నిర్వాహకులు సన్మానించి ప్రత్యేక ప్రార్థన చేసి ఆశీర్వదించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏటా క్రిస్మస్ సందర్భంగా పేద క్రిస్టియన్లకు గిఫ్టులు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అన్ని పండగలను సమానంగా గౌరవించి కేసీఆర్ పేదలను హక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మెదక్ చర్చి వందేళ్ల సంబురంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కల్లోల జగతికి శాంతి సందేశం అందించిన కరుణామయుడి ప్రార్థనా మందిరం ప్రఖ్యాతి గాంచిందన్నారు. చార్లెస్ వాకర్ నిర్మించిన ఈ చర్చి ఉత్సవాల్లో ఆయన మనుమడు పాల్గొనడం ఎంతో సంతోషకరం అన్నారు. చర్చి మెదక్ జిల్లాలో ఉండడం యావత్ రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. అంతకుముందు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

‘ప్రజావాణి’కి ప్రాధాన్యమివ్వాలి

డీఆర్‌ఓ భుజంగరావు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ భుజంగరావు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి వినతులను అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ ప్రజల్లో నమ్మకం కలిగించాలని డీఆర్‌ఓ భుజంగరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు, జెడ్పీసీఈఓ ఎల్లయ్యతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణికి భూ సమస్యలపై 35, ఇందిరమ్మ ఇళ్ల కోసం 12, పెన్షన్ల కోసం 3, ఇతర సమస్యలపై 35 వినతులు వచ్చాయి.

‘పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం’

నర్సాపూర్: మెదక్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎస్ఐ చర్చి, మెదక్ ఖిల్లాతో పాటు ఏడుపాయలను అభివృద్ధి చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని చెప్పారు. నిధుల మంజూరుకు సీఎం అంగీకరించారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధిని తాము ఐదేళ్లలో చేసి చూపిస్తామన్నారు. ఏడుపాయల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తేవాలని బీజేపీ నాయకులను కలిసి కోరుతామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాగా ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి ఏడుపాయల దుర్గామాత ఆలయానికి వస్తున్నారని, జిల్లాలోని పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని కోరారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, పట్టణ అధ్యక్షుడు చిన్న అంజిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంతకాలు ఫోర్జరీ



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): కూలీల సంతకాలు ఫోర్జరీ చేసి బినామీ పేర్లపై డబ్బులు తీసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని అదనపు డీఆర్‌డీఓ రంగాచారి తెలిపారు. మండలంలో 2023– 24 సంవత్సరంలో రూ. 3.77 కోట్లు, పంచాయతీరాజ్‌లో రూ. 2.69 కోట్ల పనులకు సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని ఎల్లుపేటలో టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మేకలు, పశువుల షెడ్డుల నిర్మాణంలో వెటర్నరీ డాక్టర్ సంతకం లేకుండానే బిల్లులు తీసుకోవడం, ఆశావర్కర్, కార్మికులు, లైన్‌మెన్లు పనిచేస్తున్నట్లుగా కూలీలు తీసుకుంటున్నట్లు రికార్డులు సృష్టించినట్లు చెప్పారు. సామాజిక తనిఖీలో రికవరీ రూ. 5.25 లక్షలు, రూ. 47 వేల జరిమానా విధించారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, నాణ్యత పరిశీలకురాలు జ్యోతి, ఎంపీడీఓ విఠల్, ఎంపీఓ రియాజొద్దీన్, పీఆర్‌ఏఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఇంటర్మీడియెట్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు ప్రణాళికా సిద్ధం చేశారు. మూడేళ్లుగా అత్తెసరు ఫలితాలతోనే సరిపెట్టగా.. ఈసారి మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విద్యార్థులను లెక్చరర్లు దత్తత తీసుకున్నారు. నెలాఖరుకు సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు ప్రారంభించనున్నారు.



మెదక్ ప్రభుత్వ బాలికల కళాశాల

ఇంటర్ అధికారుల ప్రత్యేక ప్రణాళిక

- మూడేళ్లుగా అత్తెసరు ఫలితాలతోనే సరి
- జిల్లావ్యాప్తంగా 61 ఇంటర్ కళాశాలలు
- 13 వేల పైచిలుకు విద్యార్థులు

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా మొత్తం 61 ఇంటర్మీడియెట్ కాలేజీలు ఉండగా, వాటిలో 13,600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే మూడేళ్లుగా అత్తెసరు ఫలితాలే రావడంతో ఇంటర్‌బోర్డు అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పద్ధతి మారాలని, ఫలితాల్లో మార్పు తీసుకురావాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈసారి వందశాతం ఫలితాల సాధన కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా లెక్చరర్లు విద్యార్థులను దత్తత తీసుకున్నారు. ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రభుత్వ సెక్టార్ పరిధిలోని కళాశాలల్లో సైతం ఇదే విధానం అవలంభిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మెరుగైన ఫలితాల సాధనకు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. సబ్జెక్టుల వారీగా ప్రత్యేకంగా తయారు చేసిన ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించి చదివిస్తున్నారు. ప్రాధాన్యం గల ప్రశ్నలను ప్రతి విద్యార్థి నేర్చుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నెలాఖరుకు సిలబస్ పూర్తి

కాగా ఈ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేయాలని లెక్చరర్లకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జనవరిలో ప్రీ ఫైనల్ పరీక్షలు, ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, మార్చిలో ఫైనల్ ఎగ్జామ్స్ ఉన్నందున ఈ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు ప్రారంభించనున్నారు. ఎప్పటికప్పుడు రివిజన్ చేసుకుంటూ వారానికోమారు టెస్టులు పెడుతూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం



ఈ సంవత్సరం ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ఇందుకోసం లెక్చరర్లకు విద్యార్థులను దత్తత ఇచ్చాం. వారు మెరుగైన ఫలితాల సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మాధవి, జిల్లా ఇంటర్‌నోడల్ అధికారి

కేవీకేలో హెలికాప్టర్ ట్రయల్‌రన్

కౌడిపల్లి(నర్సాపూర్): కేవీకేకు ఈనెల 25న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ వస్తుండటంతో సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు రెండు హెలికాప్టర్లతో ట్రయల్‌రన్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. అనంతరం కేవీకే సమీపంలో మూడు హెలిప్యాడ్‌లు నిర్మించగా వాటిని సందర్శించారు. అలాగే సభా ప్రాంగణం, సేంద్రియ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు స్థలం, రూట్‌మ్యాప్, బ్లూ ప్రింట్‌ను పరిశీలించారు. కేవీకే హెడ్‌అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ కేవీకే చేపట్టే కార్యక్రమాలను వారికి వివరించారు. వీరితో పాటు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి, ఇన్‌చార్జి డీపీఓ వినయ్‌కుమార్ కేవీకేలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఓ స్వప్న వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఏకత్వం.. నూతనత్వం

- కదిలిన ‘విద్యార్థి’ లోకం
- అట్టహాసంగా ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు షురూ..
- హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్ని దారులూ సిద్దిపేట వైపే.. ఎటు చూసినా ఏబీవీపీ కార్యకర్తలే.. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివస్తూ.. ఏకత్వంలో నూతనత్వం చాటుతూ.. జెండాలు చేతబూని విద్యార్థి లోకం కదిలింది. సోమవారం సిద్దిపేటలో ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మహాసభలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి శక్తి జాతీయ శక్తి అని జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. అఖిల భారత సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఏబీవీపీ అన్ని ప్రాంతాలను, వర్గాలను, కులమతాలను ఏకతాటిపైకి తీసుకువస్తోందన్నారు. జాతీయ పునర్నిర్మాణానికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. అలాగే సామాజిక సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. ఏబీవీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, గోపన్న, రామన్నలు నక్సల్స్‌కు, వామపక్ష తీవ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. విద్యార్థులందరూ చదువుతో పాటుగా శారీరక దారుఢ్యం కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందాల్సిన అవసరం ఉందని, అందుకు ఏబీవీపీ కృషి చేస్తుందన్నారు. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి మాట్లాడుతూ.. ఏబీవీపీ 75 సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని, 55 లక్షల మందితో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భవించిందన్నారు. రానున్న రోజుల్లో మరింత విస్తరిస్తుందని అన్నారు.



గవర్నర్‌కు షీల్డ్‌ను బహూకరిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగులకు వెబ్ యాప్ డెవలప్‌మెంట్, సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు మూడు నెలల పాటు 60మందికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31లోగా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘ఆ అధికారులపై చర్యలు తీసుకోండి’

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కాంటా చేసి రసీదు అందించినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా ధాన్యం డబ్బులలో కోతపెట్టిన ఐకేపీ అధికారులపై చర్యలు తీసుకోవాలని నార్సింగి మండలం శేరిపల్లి రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రైతులకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రైతులు

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పాపన్నపేట(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కోరారు. ఈనెల 25వ తేదీన సీఎం ఏడుపాయల పర్యటన నేపథ్యంలో సోమవారం దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌బాబు, జాయింట్ కమిషనర్ రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ప్రాశస్త్యం ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మంజీరా పవిత్రత కనిపించాలన్నారు. నదిలో గుర్రపు డెక్కను తొలగించాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు దేవాదాయ కమిషనర్ శ్రీధర్‌బాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసరాలను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎటు చూసిన భక్తి భావం వికసించాలన్నారు. ఆలయ చరిత్రలో మొదటిసారిగా వస్తున్న సీఎంకు ఘనస్వాగతం పలకాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్, హన్మంతరావు

ఆలయ భూములకు జియో ట్యాగింగ్

సమాచారం అంతా ఆన్‌లైన్‌లో నమోదు

- ఆలయ స్వరూపంతోపాటు ఆస్తుల వివరాలు నమోదు
- కసరత్తు ప్రారంభించిన దేవాదాయ అధికారులు
- ఆలయాలను గుర్తించడం ఇక సులభతరం

సంగారెడ్డి జోన్: జిల్లాలోని దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందులోభాగంగానే ఆలయ భూములతోపాటు ఆస్తులకు జియో ట్యాగింగ్ చేయనున్నారు. ఆలయాల పూర్తి సమాచారం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఆలయాలన్నింటినీ సులభంగా గుర్తించేలా భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసే విధంగా చర్యలు చేపట్టింది. పోటీ ప్రపంచంలో పెరుగుతున్న సాంకేతికతను వినియోగించుకుంటూ ఆధునిక విధానంవైపు అడుగులు వేస్తూ ఆస్తుల పరిరక్షణ లక్ష్యంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 36 దేవాలయాలు ఉన్నాయి. అదేవిధంగా ధూప దీప నైవేద్య పథకం ద్వారా గుర్తింపు పొందినవి 939 దేవాలయాలున్నాయి. ఆయా ఆలయాలకు వచ్చే సంవత్సర ఆదాయాన్ని బట్టి ఆలయాలను విభజించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 6(ఏ) కేటగిరీలో 13, 6(బీ) కేటగిరీలో 12, 6(సీ) కేటగిరీలో 10, 6(డీ) కేటగిరీలో 1 చొప్పున ఆలయాలు ఉన్నాయి. ఆయా జిల్లాలోని ఆలయాల స్వరూపంతోపాటు భూముల అన్ని రకాల వివరాలను గ్లోబల్ పొజిషన్ సిస్టం(జీపీఎస్)కు అనుసంధానం చేయనున్నారు. అందులో భాగంగా ఆలయం ఎక్కడ ఉంది? ఆ ఆలయానికి సంబంధించిన భూములు ఉన్నాయా....ఉంటే ఏయే సర్వే నంబర్లలో ఉన్నాయి? ఆలయ సరిహద్దులు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.



ఝురాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం

జిల్లాలు, కేటగిరీల వారీగా ఉమ్మడి మెదక్ జిల్లా ఆలయాల వివరాలు

కేటగిరీ	మెదక్	సంగారెడ్డి	సిద్దిపేట
6(ఎ)	2	4	7
6(బీ)	3	3	6
6(సీ)	2	5	3
6(డీ)	0	1	0
మొత్తం	7	13	16

జిల్లాల వారీగా ధూపదీప నైవేద్య పథకం ద్వారా మంజూరు చేయబడ్డ ఆలయాలు

	మెదక్	సంగారెడ్డి	సిద్దిపేట
మొదటి దశ	43	31	144
రెండవ దశ	43	91	142
మూడవ దశ	93	181	171
మొత్తం	179	303	457

త్వరలో అప్‌లోడ్

దేవాదాయ శాఖ అధికారులు జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలు తీసి అక్షాంశాలు, రేఖాంశాలు, లొకేషన్ ఆధారంగా ఆలయాలకు సంబంధించిన ఆస్తులు భూముల వివరాలతో పాటు ఫోటోలను సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఆలయ భూములను సర్వే చేసి, మార్కింగ్ వేసి అప్‌లోడ్ చేయనున్నారు. అనంతరం సేకరించిన వివరాలు పరిశీలించివాటికి జియో ట్యాగింగ్ చేయనున్నారు. ఆలయానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునే విధంగా గూగుల్‌లో అందుబాటులో ఉండే విధంగా నమోదు చేయనున్నారు. ఒక్క క్లిక్‌తో ఇంటర్‌నెట్ ద్వారా ఆలయానికి సంబంధించిన పూర్తి వివరాలను ఫొటోలతో సహా తెలుసుకునేందుకు వీలుంటుంది.

క్లుప్తంగా

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు అందుకుంటున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దుబ్బాక విద్యార్థులు సత్తా చాటారని కరాటే మాస్టర్ బురానీ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డైనమిక్ షోటాకాన్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో మేడ్చల్‌లో జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌కి చెందిన మేఘన గోల్డ్ మెడల్, శర్వానీ సిల్వర్, దుబ్బాక మాస్టర్ మైండ్ పాఠశాలకి చెందిన హర్షవర్ధన్ గోల్డ్, గాయత్రీ వివేకానంద పాఠశాలకి చెందిన నిశాల్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్లు, సురేందర్, నగేశ్ అభినందించారు.

ఇంధన ఫ్యాక్టరీ పనులను నిలిపివేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజాభిప్రాయం సేకరించకుండా గుగ్గిల్ల సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను వెంటనే నిలిపి వేయించాలని సోమవారం గుగ్గిల్ల గ్రామస్తులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ బీ.లక్ష్మణ్ తదితరులకు వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతికి వచ్చిన సందర్భంగా వారిని కలిసినట్లు మాజీ సర్పంచ్ నాగభూషణం తెలిపారు.

ప్రజల అవసరాలు తీర్చాలి


మాట్లాడుతున్న శేఖర్ రావు

హుస్నాబాద్: ప్రజా క్షేత్రంలో ప్రతీ వ్యక్తి అవసరాలను తీర్చడమే ప్రజా నాయకుడి లక్షణమని ట్రస్మా చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో స్కావెంజర్లు లేక సరైన సదుపాయాలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ట్రస్మా నాయకుడిగా విద్యార్థుల విద్య, వైద్యం సమస్యలు తీర్చానన్నారు. అన్ని రంగాల్లోని ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉన్నానన్నారు. కోర్టులకు పక్కా భవనాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, తాగు నీటి అవసరాలను తీరుస్తానన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో నిరుద్యోగుల, ప్రజల గొంతుక అవుతానని అన్నారు. సమావేశంలో ట్రస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాజేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, శైలేందర్, శ్రీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆరు ఊర్లై.. అంతా క్రైస్తవులై

నాటి గుంటూరు గుడిసెలే నేటి హత్నూర మండలం రెడ్డిపాలెం అనే గ్రామం.. ఇతర ప్రాంతం నుంచి బతుకుదెరువు కోసం వలసొచ్చి ఆరు కుటుంబాలే ఓ గ్రామాన్ని స్వయంగా ఏర్పరచుకున్నాయి.. అవే ఆరు కుటుంబాలు నేడు 45 కుటుంబాలతో రెడ్డిపాలెం గ్రామం విరాజిల్లుతోంది. గ్రామమంతా రోమన్ క్యాథలిక్ క్రిస్టియన్స్ కావడం మరో విశేషం. జిల్లాలోనే ప్రత్యేకంగా నిలిచిన ఈ గ్రామంపై సాక్షి ప్రత్యేక కథనం...

రెడ్డిపాలెం గ్రామంగా గుంటూరు గుడిసెలు

1945లో వలసొచ్చిన ఆరు కుటుంబాలు	ప్రస్తుతం 45 కుటుంబాలు 263 మంది జనాభా	ఊరంతా రోమన్ క్యాథలిక్ క్రిస్టియన్స్	వ్యవసాయమే జీవనాధారం	ఉద్యోగాల్లో యువత


రెడ్డిపాలెం గ్రామం, చర్చి

హత్నూర(సంగారెడ్డి):

గుంటూరు జిల్లా తాళ్లచెరువు ప్రాంతం నుంచి సుమారు 150 ఏళ్ల కిందట వరంగల్ జిల్లా నార్మెట్ల మండలం ఆగాపేట గ్రామంలో నివాసం ఏర్పరచుకొని కొన్ని కుటుంబాలు జీవనం కొనసాగించాయి. ఇందులో నుంచి 1945 సంవత్సరంలో థామస్ రెడ్డి చౌరమ్మ కుటుంబంతోపాటు మరో ఐదు కుటుంబాలు కలిసి హత్నూర మండలం చింతల్ చెరువు- గుండ్ల మాచునూర్ గ్రామాల మధ్య కొంత వ్యవసాయ భూమి తీసుకొని గుంటూరు గుడిసెల పేరుతో నివాసం ప్రారంభించారు. సుమారు 80 ఏళ్ల కిందట ఏర్పడిన గుంటూరు గుడిసెలు నేడు రెడ్డి పాలెం గ్రామంగా ఆవిర్భవించింది.

అందరూ 'చర్చి'ంచుకునేలా..

గ్రామంలో 1974 సంవత్సరంలో రోమన్ క్యాథలిక్ ఆధ్వర్యంలో చిన్న చర్చిని నిర్మించుకున్నారు. అనంతరం 2004లో నూతనంగా పెద్ద ఎత్తున చర్చిని నిర్మించుకొని ప్రతిరోజు ప్రార్థనలు చేస్తున్నారు. ఈ గ్రామంలో ఒక్కరు కూడా ఇతర మతస్తులు లేరు అందరూ రోమన్ క్యాథలిక్ క్రిస్టియన్ ఉన్నారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థిరపడి గ్రామాన్ని ఏర్పరచుకొని ఒకే మతానికి సంబంధించిన శైలిని ఆచరిస్తూ జిల్లాకే ఆదర్శంగా రెడ్డిపాలెం నిలిచింది.

వ్యవసాయమే జీవనాధారంగా..

రెడ్డి పాలెం గ్రామంలో 263 మంది జనాభా ఉండగా, 211 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం గ్రామంలో 400 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. ఇదేకాక ఇతరుల భూమిని సైతం కౌలుకు చేస్తూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా పత్తి, వరి సాగు చేస్తున్నారు. సుమారు 15 మంది విద్యార్థులు ఉన్నత విద్య చదువుకొని అమెరికా, ఆస్ట్రేలియాల్లో ఉద్యోగాలు చేస్తూ ఉన్నారు.


గుడిసెలో ఏసుప్రభు వృత్తాంతం


ప్రార్థన మందిరంలో యేసు ప్రభువు

ఈ గ్రామం నుంచి ముగ్గురు సర్పంచ్‌లు..

చింతల్ చెరువు మధిర గ్రామంగా రెడ్డిపాలెం ఉన్నప్పుడు లూడిదమ్మ, లూడిది రెడ్డి ఇద్దరూ సర్పంచ్‌గా కొనసాగారు. ఆరేళ్ల కిందట కోనంపేట గ్రామ పంచాయతీ పరిధిలోకి రెడ్డిపాలెం చేరినప్పటికీ ఈ గ్రామానికి చెందిన శౌరిరెడ్డి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ గ్రామం నుంచి మొత్తం ముగ్గురు సర్పంచ్‌లు ఎన్నికై ఐదు గ్రామాల ప్రజలను పరిపాలించారు. ఈ గ్రామం ఐక్యతకు నిదర్శనం, ఒక నాయకుడిని ఎన్నుకునేందుకు చర్చిలో సమావేశమై నిర్ణయం తీసుకొని దాని ప్రకారం పాలకులను ఎన్నుకుంటారు. క్రిస్మస్ సందర్భంగా గ్రామంలోని 45 కుటుంబాల ఇళ్లలో క్రిస్మస్‌కు సంబంధించిన గుడిసెను ఏర్పాటు చేసి ఏసుక్రీస్తు జీవిత వృత్తాంతాన్ని ఏర్పరచుకున్నారు.

ఐక్యంగా ఉంటాం



మా గ్రామంలో అందరం రోమన్ క్యాథలిక్ వాళ్లం కావడంతో ఐక్యంగా ఉంటాం. బతుకుదెరువు కోసం వచ్చి మా పెద్దవాళ్లు ఇక్కడ స్థిరపడ్డారు. ఇతర మతం అనేది మా గ్రామంలో లేదు.మూడుసార్లు సర్పంచ్‌గా ఈ గ్రామం నుంచే ఎన్నికయ్యారు. వ్యవసాయం చేసుకొని జీవిస్తూ పిల్లలను మంచిగా చదివిస్తున్నాం. గ్రామాన్ని సైతం అభివృద్ధి చేసుకుంటున్నాం.

– శౌరిరెడ్డి, తాజా మాజీ సర్పంచ్

ఇక్కడికి వచ్చినప్పుడు ఏడాది పాపను



మా తల్లిదండ్రులు చౌరమ్మ థామస్ రెడ్డితోపాటు మరో ఐదు కుటుంబాలు 1945 సంవత్సరంలో ఇక్కడికి వలసొచ్చారు. అప్పుడు నా వయసు ఏడాదిలోపే, కొన్నేళ్ల తర్వాత మరి కొంతమంది కుటుంబాలు బంధువులు మాతోపాటు ఇక్కడ ఉండేవారు. అంతా గుంటూరు గుడిసెల ప్రాంతంలో నివసించారు. కొన్నేళ్ల తర్వాత మా గ్రామానికి రెడ్డి పాలెం అని పేరు పెట్టుకున్నాం. మేము ఇద్దరం అక్కాచెల్లెళ్లం కావడంతో మా నాన్న నన్ను ఇక్కడే ఇంట్లో పెట్టుకున్నారు. ఒకప్పుడు గుంటూరు గుడిసెలు అని పిలిచేది నేడు రెడ్డి పాలెంగా ఐక్యతంగా ఉంటున్నాం.

– మెట్టు టీకులమ్మ

బోనాలతో ఉద్యోగుల సమ్మె


బోనాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్ వద్ద వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం 13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా బోనాలతోపాటు పోతరాజు వేషాధారణలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఇన్ని రోజులుగా నిరసన చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు. నిరసనకు తపస్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ మద్దతు పలికారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి కరుణాకర్, రాష్ట్ర నాయకులు సురేందర్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

దుబ్బాకటౌన్: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన రాయపోల్ మండలం వీరానగర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా వినుకొండ గ్రామానికి చెందిన ఈర్ల కోటి, అంజిబాబు (19) ఇద్దరూ అన్నదమ్ముళ్లు. రాయపోల్ మండలం వీరానగర్ గ్రామంలో మూడు నెలలుగా నివాసముంటూ కొండపోచమ్మ ప్రాజెక్టు కాల్వ నిర్మాణ పనుల్లో సెంట్రింగ్ కూలీలుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం ముంగిస్‌పల్లి గ్రామ పరిధిలో కాంక్రీట్ లోడ్ వాహనం ఖాళీ చేసే సందర్భంలో విద్యుత్ తీగ కాంక్రీట్ వాహనానికి తగిలింది. అదే సమయంలో అంజిబాబు వాహనాన్ని పట్టుకోవడంతో విద్యుత్ షాక్ కు గురయ్యాడు. గమనించిన స్థానికులు హుటాహుటినా చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అంజిబాబు మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఈర్ల కోటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాయపోల్ ఏఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు.

రసవత్తరంగా స్విమ్మింగ్ పోటీలు



స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సిద్దిపేటజోన్: సీఎం కప్ టోర్నీలో భాగంగా సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పూల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 40 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఫ్రీ స్టయిల్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్ తదితర విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి సీఎం కప్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఆయా విభాగాల్లో గెలిచిన వారికి మెడల్స్ ప్రదానం చేశారు. పోటీలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రవీణ్, తదితరులు పర్యవేక్షించారు.

బైండోవర్ ఉల్లంఘన

వ్యక్తికి రూ.లక్ష జరిమాన


జరిమాన విధిస్తున్న సీఐ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: బైండోవర్ నింబధనలు ఉల్లంఘించిన వ్యక్తికి సిద్దిపేట ఎక్సైజ్ పోలీసులు జరిమాన విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌కు చెందిన చేపూరి నర్సింలు అలియాస్ నరేశ్ 2023లో ఆల్ప్రాజోలం రవాణా చేస్తూ పట్టుబడడంతో అధికారులు అతడిని దుబ్బాక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నర్సింలు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి ఇటీవల మళ్లీ ఆల్ప్రాజోలం రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో ఎక్సైజ్ అధికారులు జరిమాన విధించారు. అతడి కుటుంబ సభ్యులు చలాన్ రూపంలో రూ.లక్ష జరిమాన చెల్లించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆకట్టుకున్నారు

- పర్యావరణ హితం ఆ ఇల్లు
- బహుళ ప్రయోజనం.. ఖర్చు తక్కువ




అనంతసాగర్‌లోని ఇల్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): పర్యావరణ హితం.. వాతావరణానికి అనుకూలం.. నిర్మాణ ఖర్చు తక్కువ.. బహుళ ప్రయోజనమే లక్ష్యంగా మట్టి, ఇసుక, సిమెంట్, డంగ్ సున్నంతో కలిపి చేసిన ఆ ఇల్లు ఎంతో ఆకట్టుకుంటుంది. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన కొండం లక్ష్మారెడ్డి రిటైర్డ్ ఉద్యోగి. ఇతను తన ఇంటిని వినూత్న రీతిలో నిర్మించారు. తెలంగాణలో మొదటి సారిగా లక్ష్మారెడ్డి తన కుమారుడు, స్నేహితుడి సూచనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ ఇల్లు వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలాలకు అనుగుణంగా ఉంటుంది. 140 గజాల్లో రూ.30 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేశాడు. ఇంత పెద్దగా ఇక్కడి పద్ధతిలో చేస్తే సుమారు రూ. 60 లక్షల వరకు ఖర్చు అయ్యేదని, తక్కువ డబ్బులతో వాతావరణ, వాయు కాలుష్యం నుంచి రక్షణ కలిపిస్తుందని ఇంటి యాజమాని తెలిపారు. ఈ ఇంటి నిర్మాణాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కేరళ ప్రాంతంలో ఇలాంటి నిర్మాణాలు కనిపిస్తుంటాయి.

పెళ్లయిన రాత్రికే.. వధువు పరార్

- కంగుతిన్న వరుడి కుటుంబ సభ్యులు
- యువకుడితో ప్రేమ వ్యవహారమే కారణమా!
- సహకరించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


పోలీస్‌స్టేషన్ వద్ద పెళ్లికూతురు బంధువులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉదయం వైభవంగా పెళ్లి.. మూడుముళ్లతో ఒక్కటైన బంధం. విందు, వినోదాలతో ఎక్కడ చూసినా పెళ్లి సందడి. రాత్రి బాజాభజంత్రీలతో బరాత్ నిర్వహించారు. సీన్ కట్ చేస్తే.. తెల్లారేసరికి పెళ్లి కూతురు పరార్. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం మడూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ కథనం మేరకు.. పేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన కిషన్ కూతురు తేజను అదే మండలం మడూర్ గ్రామానికి చెందిన రవితేజకు ఇచ్చి ఆదివారం వైభవంగా పెళ్లి జరిపించారు. యువకుడు ఉద్యోగం చేస్తుండడంతో పెళ్లి గ్రాండ్‌గా జరగాలని ఖర్చుకు ఎక్కడా రాజీ పడలేదు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో జరిగిన ఈ పెళ్లికి పెద్ద సంఖ్యలో బంధువుల, మిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి తంతు ముగిసి అప్పగింతలు నిర్వహించాక, వరుడు గ్రామమైన మడూర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఘనంగా బరాత్ నిర్వహించారు. బరాత్ నిర్వహించిన ఆనందంతోపాటు అలసిన కుటుంబ సభ్యులు అందరూ ఆదమరచి నిద్రపోతున్న సమయంలో.. అర్ధరాత్రి తర్వాత వధువు తన దగ్గరి బంధువు, వరుసకు బావ (నాగ్సాన్‌పల్లి అమ్మమ్మగారి ఊరు)తో కలిసి వాహనంలో పరార్ అయ్యింది. తెల్లవారుజామున విషయం గమనించిన వరుడి కుటుంబ సభ్యులు పెళ్లి కూతురు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా పెళ్లికి ముందే యువతి మేనమామ కుమారుడితో ప్రేమలో పడినట్లు తెలిసింది. తమ కాళ్లు మొక్కే యువకుడితో పెళ్లికి ఇంట్లో ఒప్పుకోరనే భయంతో విషయం దాచిపెట్టి మరో యువకుడితో పెళ్లి చేసుకున్న యువతి పథకం ప్రకారం ప్రేమికుడితో కలిసి పరారైంది. ఇందుకు సహకరించిన మరో ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సోమవారం పెళ్లి కూతురు తల్లిదండ్రులు పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

టేక్మాల్(మెదక్): లారీని డీసీఎం వాహనం ఢీకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి 161 హైవేపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ బొడ్మట్‌పల్లి హైవేపై టీ తాగేందుకు ఓ హోటల్ ఎదుట నిలిపాడు. అతివేగంగా వెనుకాల నుంచి వచ్చి బియ్యం లోడుతో వస్తున్న నవతా ట్రాన్స్‌పోర్ట్ డీసీఎం ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ శ్రీకాంత్ కాలు విరిగి తీవ్ర గాయాలు కావడంతో హైవే సిబ్బంది క్షతగాత్రుడిని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి ఏఎస్‌ఐ తుక్కయ్య చేరుకొని వివరాలు సేకరించి, ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుపై నుంచి క్రెయిన్ సాయంతో తొలగించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

హవేళిఘణాపూర్(మెదక్) : లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మెదక్ మండల పరిధిలోని పేరూర్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన గాలి శ్రీనివాస్ మెదక్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఫోన్ రావడంతో పేరూర్ గ్రామ శివారులో బైక్ నిలిపి మాట్లాడుతున్నాడు. ఇదే సమయంలో మెదక్ వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీ తెలిపారు.

సమస్య కొండంతై.. మెడకు ఉరితాడై

వేర్వేరు చోట్ల ఉరేసుకొని ఐదుగురు బలవన్మరణం

ప్రేమించిన యువతి దూరమైందని..


నితీశ్ మృతదేహం

సిద్దిపేటఅర్బన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో చోటుచేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంతూరి నితీశ్ (25) తండ్రి గతంలో చనిపోగా తల్లి, చెల్లితో కలిసి పొన్నాలలోని టీహెచ్ఆర్ నగర్‌లో నివాసం ఉంటూ మొబైల్ షాపులో పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ యువతిని ప్రేమించగా ఇద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. గత జూలై నెలలో యువతి పురుగుల మందు తాగి చనిపోయింది. ఆమె మృతికి నితీశ్ కారణమని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు కావడంతో జైలుకు వెళ్లాడు. యువతి దూరం కావడం, జైలుకు వెళ్లడం వంటి కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు..

సంగారెడ్డి క్రైమ్: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణంలోని ముగ్దూంనగర్‌కు చెందిన ఎండీ సద్దాం (33) డ్రైవర్‌గా పని చేసేవాడు. నిత్యం మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు నిలదీశారు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన అతడు 23వ తేదీన సంగారెడ్డి పట్టణంలోని మహబూబుసాగర్ చెరువులో విగత జీవిగా కనిపించాడు. తన భార్య షబ్‌నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో ట్రాక్టర్ డ్రైవర్..


భాస్కర్ మృతదేహం

దుబ్బాక: ట్రాక్టర్ డ్రైవర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన దౌల్తాబాద్ మండలం ముత్యంపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. మండలంలోని ముత్యంపేటకు చెందిన తొడంగి భాస్కర్(27) ఐదేళ్ల కిందట విజయలక్ష్మీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. భాస్కర్ గాజులపల్లిలో పంజ ఎల్లం వద్ద డోజర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెడు తిరుగుడు వద్దన్నందుకు ఆదివారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఇంటినుంచి వెళ్లి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు భార్యకు, స్నేహితుడి వాట్సాప్‌లో మెసెజ్ పెట్టినట్లు తెలిపారు. సోమవారం మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యం బాగాలేదని..

చేగుంట(తూప్రాన్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిక్కుడు స్వామి(44) కొద్ది నెలలుగా నడుము నొప్పితో బాధపడుతున్నాడు. అనారోగ్యం విషయంలో మదనపడుతూ తాను బతకడం వృథా అని పలువురితో వాపోయేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన స్వామి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రామవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై..


సిద్దిరాములు (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్):విద్యుత్ స్తంభానికి ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మిర్జాపల్లి గ్రామానికి చెందిన చింతల సిద్దిరాములు(45) పెయింటర్‌గా పని చేసేవాడు. మద్యానికి బానిసై ఇంట్లో పనులు పట్టించుకోకపోగా నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం భార్యాభర్తల మధ్య ఇదే విషయంపై గొడవ జరిగింది. దీంతో సిద్దిరాములు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం భార్య రాధిక నిద్రలేచి చూసే సరికి ఇంటి ఎదుట ఉన్న విద్యుత్ స్తంభానికి ఉరేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట పోలీసులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని కిందకి దించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.